
# మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం



వివరాలు మెయిన్‌లో...


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 11 ఏప్రిల్, 2026 | పేజీలు : 08


# మొక్కజొన్న రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/ధర్మపురి :** రబీ సీజన్ లో రైతులు పండించిన మొక్కజొన్న పంటకు మద్దతు ధర కల్పిస్తూ ప్రభుత్వం డీసీ ఎంఎస్ ల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నదని, రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.శుక్రవారం ధర్మపురి వ్యవసాయ మార్కెట్ లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రైతులు ధర్మపురి నియోజకవర్గంలో 25 శాతం అధికంగా మొక్కజొన్న సాగు చేశారని అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, వెల్గటూర్, బుగ్గారం, గొల్లపల్లి, పెగడపల్లి మరియు ఎండపల్లి మండలాల్లో 4898 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారని మంత్రి తెలిపారు.రైతులు పెద్ద ఎత్తున పంట సాగు చేసిన నేపథ్యంలో రైతులకు మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వం మెక్కజోన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు.రైతులు పండించిన పంటను దళారులు క్వింటాలుకు రూ. 1600 మాత్రమే చెల్లించి కొనుగోలు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. రైతులకు మద్దతు ధర అందించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నదని మంత్రి తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్నలు విక్రయించి క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర పొందాలని మంత్రి కోరారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏనాడు రైతుల సమస్యలు పట్టించుకోలేదని పైగా ధాన్యం కొనుగోలు లో క్వింటాల్ కు నాలుగు కిలోల కోత విధించారని మంత్రి అన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం నుండి సరైన సహకారం లేనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గడిచిన రెండు సంవత్సరాలుగా ఎలాంటి కోత లేకుండా రైతులు పండించిన పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నదని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగల రాజేష్,ఏఎంసి డైరెక్టర్లు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# లేఅవుట్ల అనుమతికి నిబంధనలు పాటించాల్సిందే

### కలెక్టర్ చిత్రా మిశ్రా



**ప్రజాపక్షం/కరీంనగర్ :** ప్రభుత్వం నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, లే అవుట్లకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్ చిత్రా మిశ్రా, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ, టౌన్ ప్లానింగ్, ల్యాండ్స్ అండ్ సర్వే, నీటిపారుదల శాఖ తదితర శాఖల అధికారులతో లేఅవుట్ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి కలెక్టర్ లేఅవుట్ కమిటీ చైర్ పర్సన్ గా హాజరై మాట్లాడారు. జిల్లాలో లే అవుట్ అనుమతి కోసం వచ్చిన దరఖాస్తులను 21 రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. సైట్ వైస్ విజిట్ చేస్తూ లేఅవుట్ స్థలంలో కనీస సౌకర్యాలు కల్పిస్తున్నారా..?. లైటింగ్, అప్రోచ్ రోడ్డు, వాటర్ సప్లై తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని లేఅవుట్ కమిటీ సభ్యులకు సూచించారు. జీవో నెంబర్ 105 పై దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా పరిశీలించాలన్నారు. అవసరమైతే సంయుక్త సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలు లే అవుట్ల గురించి చర్చించారు. రెండు రకాల లేఅవుట్లు (డ్రాఫ్ట్ లేఅవుట్, ఫైనల్ లేఅవుట్) ఉంటాయని, డ్రాఫ్ట్ లేఅవుట్ కు, ఫైనల్ లే అవుట్ కు రెండేళ్ల వ్యవధి ఉంటుందని డ్రాఫ్ట్ లేఅవుట్ లో పొందుపరిచిన (అప్రూవ్ చేసి) సౌకర్యాలు, ఫైనల్ లే అవుట్ లో కల్పించకుంటే డెవలపర్ (దరఖాస్తుదారు) పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పది ఎకరాల లే అవుట్ కు కలెక్టరే అనుమతులు మంజూరు చేస్తారని, అంతకు మించి పెరిగితే టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ హైదరాబాద్ వారు అనుమతులు జారీ చేస్తారని అధికారులు వివరించారు. అంతకుముందు లేఅవుట్ నిబంధనలు, దరఖాస్తు ప్రక్రియ తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) లక్ష్మికిరణ్, ఆర్డీవో మహేశ్వర్, డీటీసీవో ఆంజనేయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆయుర్వేద, యునాని, హోమియోపతి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** ఆయుర్వేద, యునాని, హోమియోపతి వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శుక్రవారం పెద్దపల్లి జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రి ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఉచిత ఆయుష్ వైద్య శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆయుర్వేద, హోమియో, యునాని మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, జిల్లా ఆయుష్ ఆస్పత్రిలో రోజు100 నుండి 120 మంది బయటి రోగులు వైద్య సేవలు వినియోగించుకుంటున్నారని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన మందులు , వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని జిల్లా ప్రజలు వైద్య సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ అన్నారు.అంతకంటే ముందు వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రకరకాల యునాని, ఆయుర్వేదిక్, హోమియోపతి మెగా వైద్య శిబిర మందుల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య వైద్యశాఖ అధికారి డాక్టర్. ప్రమోద్ కుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్. శ్రీధర్,ఆయుష్ వైద్యులు ,సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# పెద్దూర్ కెజిబివి, చౌక ధరల దుకాణంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం విద్యార్థులకు అల్పాహారం ఇచ్చే సమయం కావడంతో జిల్లా కలెక్టర్ ముందుగా మెనూ చార్ట్ పరిశీలించారు. నేరుగా డైనింగ్ రూమ్ వద్దకు చేరుకొని.. ప్లేట్ తీసుకుని విద్యార్థులతో కలిసి టిఫిన్ చేశారు. మెనూ ప్రకారం భోజనం, ఇతర ఆహార పదార్థాలు ఇస్తున్నారా అని ఆరా తీశారు. వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. చదవడం, రాయడం, ప్రణాళిక సిద్ధం చేసుకోవడం తదితర అంశాలపై విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచనలు చేశారు. మంచిగా చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

**చౌక ధరల దుకాణంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చౌక ధరల దుకాణంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్ నగర్ లో ఉన్న చౌక ధరల దుకాణంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి.. ఆన్లైన్ లో లబ్దిదారుల వివరాల నమోదు .. సన్న బియ్యం పంపిణీని పరిశీలించారు. ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారులకు ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ చేయాలని ఇప్పటికే అన్ని చౌక ధరల దుకాణాలకు అందించింది. ఈ సందర్భంగా పలువురు రేషన్ కార్డుల లబ్ధిదారులతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఇప్పటిదాకా ఎందరు లబ్ధిదారులు సన్న బియ్యం తీసుకువెళ్ళారు? పంపిణీలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రేషన్ డీలర్ ను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు.

# నేడు మల్యాల మండలంలో విద్యుత్ అంతరాయం

ప్రజాపక్షం/మల్యాల: జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కల్లపెల్లి 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రంలో నెల వారి నిర్వహణ మరమ్మత్తులు జరుగుతున్నందున శనివారం విద్యుత్ సరఫరా ఉదయం 09:30 గంటల నుండి 11:30 గంటల వరకు నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్కో ఏఈ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు . దీని వలన మల్యాల సబ్ స్టేషన్ పరిధిలో మల్యాల, ముత్యంపేట,రాజారాం,నూకపల్లి మల్యాల క్రాస్ రోడ్ గ్రామాలకుతక్కలపల్లి సబ్స్టేషన్ పరిధిలో తక్కలపల్లి, మ్యాడం పల్లి మానాల గ్రామాల వినియోగదారులకు, వ్యవసాయబావులకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని,వినియోగదారులు, రైతులు సహకరించాలని ఏ ఈ కోరారు.

# నేడు మెగా వైద్యశిబిరం



ప్రజాపక్షం/ధర్మపురి:జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో శనివారం కరీంనగర్ అపోలో రీచ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరుగనుంది.స్థానిక న్యూ టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరం ఉదయం 8 గంటల నుండి ఒంటిగంట వరకు ఉంటుందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి .కార్డియాల జీ,న్యూరా లాజీ,యూరాలజీ,గ్యాస్ట్రో ఎంటరాల ,జన రల్ ఫిజిషియన్ తదితర స్పెషలిస్ట్ వైద్యులచే అన్నిరకాల పరీక్షలు నిర్వహించి అవస రమైన మందులను ఉచితంగా అందిం చనున్నట్లు వారు తెలిపారు.టుడి ఇకొ, ఇసిజి, బిపి ,షుగర్ ఇతరత్రా పరీక్షలు ఉచిత ంగా అందిస్తున్న ఈ శిబిరాన్ని మండ లంలోని ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని కోరారు.

# సిసి రోడ్డు పనులు చేపట్టిన సర్పంచ్ సల్ల వినోద



ప్రజాపక్షం/బీర్పూర్: మండలం లోని తాళ్ల ధర్మారం గ్రామంలో శుక్రవారం జ గిత్యాల ఎంఎల్ఏ సంజయ్ కుమార్ సహకారంతో సర్పంచ్ సల్ల వినోద లక్ష్మ ణ్ ఆధ్వర్యంలో 10 లక్షలతో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బత్తుల పద్మ రాజేష్,ఎ యం సి డైరెక్టర్ ఎనుగు జోగి రెడ్డి,యం పి డి ఒబీమేష్ వార్డు సభ్యులు పర్వతం జ్యోతి రాజమౌళి,నల్ల సత్యం రెడ్డి,మాడిశెట్టి శ్రీనివాస్,నారపాక శేఖర్,సదాల లతా జగదీష్, భూపతి అనిత నర్సింగ్, గరిగంటి భీమక్క, మరియు మాజీ సర్పంచ్లు నల్ల మైపాల్ రెడ్డి జూపల్లి మల్లేశం, మాజీ ఎంపిటిసి నారపాక రమా రమేష్, పంచాయతీ కార్యదర్శి ఆదిత్య రాజ్ ,గ్రామస్థులు పాల్గొన్నారు.

# గాయపడ్డ హమాలీకి వైద్యం అందించాలి

## మార్కెట్ యార్డులో కార్మికుల నిరసన



ప్రజాపక్షం/ధర్మపురి : కోరుట్ల ఎం ఎల్ ఎస్ గోదాంలో బస్తాలు దించుతూ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన హమాలీ కూలీ బోడమీది అశోక్ కు వెంటనే మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ధర్మపురి మార్కెట్ యార్డులోని గిడ్డంగి వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కోరుట్లకు చెందిన కార్మికుడు అశోక్ ఈనెల 2న కోరుట్ల సివిల్ సప్లై ఎంఎల్ఎస్ పాయింట్ బియ్యం గోదాంలో బస్తాలు దించుతుండగా అకస్మాత్తుగా లారీపై నుండి సంచులు జారి మీద పడటంతో తలకు తీవ్ర గాయమైందని తెలిపారు. చికత్స కోసం కోరుట్ల, జగిత్యాల,కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలకు తీసుకెళ్లగా అనంతరం ప్రతిమ ఆసుపత్రిలో తలకు ఆపరేషన్ జరిగినట్లు చెప్పారు.ఆపరేషన్ ఖర్చులు సైతం నిరుపేద బాధిత కుటుంబ సభ్యులే భరించినట్లు,చికిత్స కొనసాగుతున్నట్లు చెప్పారు. బాధితుడు అశోక్ భార్య గతంలోనే మృతిచెందగా ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు.అనంతరం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ను కార్మిక నాయకులు కలిసి బాధిత హమాలీ కార్మికుడిని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని,హమాలీ కార్మికులకు పీఎఫ్,ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని వినతి పత్రం అందించారు. ధర్మపురి సివిల్ సప్లై గోదాం కార్మికులు జి.తిరుపతి, బి.రాజన్న,మల్లేష్,మహేష్,నరేష్, రాజేశ్వర్, మల్లయ్య,శంకర్,మదుకర్,పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు ముదుగం రాజలింగం పాల్గొన్నారు.

# కన్నతల్లిని కొట్టి ఇంట్లోంచి గెంటేసిన కసాయి కొడుకులు

ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ :జగిత్యాల జిల్లా ధర్మపురి మండల కేంద్రానికి చెందిన చుక్క రమ (66)అనే వృద్ధ తల్లిని తండ్రి కర్మకాండ జరిగిన మరుసటి రోజే కొడుకులు చుక్క విజయ్, చుక్క భరత్ లు పోషించిక కొట్టి ఇంట్లోంచి గెంటి వేయగా చేయి విరిగిన పరిస్థితి లో జిల్లా కేంద్రం లోని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించి, ఆయన సాయం తో ఆర్డీవో కు ఫిర్యాదు చేసింది.అనంతరం సీనియర్ సిటిజెన్స్ కార్యాలయం లో ఆ వృద్ధ తల్లి విలేకరులతో మాట్లాడుతూ నా భర్త అంత్యక్రియల, కర్మ కాండ ఖర్చులు సైతం కొడుకులు పెట్టక పోగా,చంపుతామని బెదిరించి కొట్టుతూ నా భర్త కట్టిన ఇంట్లోంచి చేయి విరిగినా గెంటి వేశారని, నా స్వంత డబ్బులు రూ. 3లక్షల తో పాటు 6తులాల బంగారు నగలు గుంజుకున్నారని రోదిస్తూ, వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరానని, హరి అశోక్ కుమార్ సాయం తో ఎస్పీకి సైతం ఫిర్యాదు చేస్తానని తెలిపింది.ఫిర్యాదు మేరకు వయో వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం సెక్షన్ 2(b), సెక్షన్ 23 కింద కొడుకులపై కేసు నమోదు అయినట్లు, తల్లి దండ్రుల ను నిరాధరణ కు గురిచేసే వారికి 6నెలల జైలు శిక్ష విధించే అధికారం ఆర్డీవో కు ఉందని సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అన్నారు.కార్యక్రమం లోవృద్ధుల చట్టం అధికారి పి. సి. హన్మంత్ రెడ్డి,లున్నారు.

# సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజ గౌడ్



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజగౌడ్ పేర్కొన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ హోమియోపతి దినోత్సవం, ఆయుష్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రం లో ఉదయం యోగా భవన్లో యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ రాజ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని,రోజువారి జీవనశైలిలో యోగ ప్రక్రియను ఒక భాగంగా అలవార్చుకోవాలని అన్నారు.ప్రజల ఆరోగ్య సంరక్షణలో యోగా, ఆయుర్వేదం, హోమియోపతి వంటి సంప్రదాయ వైద్య పద్ధతులు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు జీవనశైలిని మెరుగుపరుస్తాయని,ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ మెగా ఆయుష్ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సులభంగా వైద్య సేవలు అందించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు.ప్రజలందరూ యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని,ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిహెచ్ఎమ్ ఒసుజాత,వివిధ జిల్లా స్థాయి అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావంతో పనిచేస్తే తప్పక గుర్తింపు

## మున్సిపల్ చైర్ పర్సన్ వాణి శ్రీనివాస్



ప్రజాపక్షం/జగిత్యాల : మున్సిపల్ అధికారులు, సిబ్బంది తమ విధులను అంకితభావంతో పని చేస్తేనే ప్రజల్లో తగిన గుర్తింపు వస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి అన్నారు..మున్సిపల్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, వార్డు అధికారులు, సిబ్బందితో చైర్ పర్సన్ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు.పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నిర్లక్ష్యానికి ఎలాంటి అవకాశం ఉండదని స్పష్టం చేస్తూ, క్రమశిక్షణతో పని చేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగి తన విధులను నిబద్ధతతో, పారదర్శకంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమస్యలు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని తెలిపారు.ప్రజల ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, ఆలస్యం లేకుండా తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, పెండింగ్లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, డి.ఈ ఆనంద్, ఇతర అధికారులు, వార్డు అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

# సమతుల్య ఆరోగ్యానికి హోమియోపతి ఉత్తమమైన మార్గం: ఎమ్మెల్యే

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : సమతుల్య ఆరోగ్యానికి హోమియోపతి పద్ధతులు ఉత్తమమైన మార్గాలు అని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.జగిత్యాల మాతా శిశు ఆసుపత్రిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆయుష్ శాఖ జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో అంతర్జాతీయ హోమియోపతి దినోత్సవం ,ఆయుష్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వే డుకల్లో పాల్గొని మాట్లాడారు.మానవుని జీవన విధానంలో యోగ భాగం కావాలన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, డిహెచ్ఎమ్ ఒసుజాత,డిప్యూటీ డిహెచ్ఎమ్ఒ,శ్రీనివాస్, సూపరిండెంట్ డా.కృష్ణ మూర్తి,మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సునీల్,,డా.నరేష్,కౌన్సిలర్ లు ప్రశాంత్ రావు, దుమాల రాజ్ కుమార్,సర్పంచ్ మోహన్ రెడ్డి,ఎఒ మెప్మ శ్రీనివాస్,నాయకులు కోటేశ్వర రావు, ప్రవీణ్ రావు, నాయకులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్నను దర్శించుకున్న నటుడు సాయి ధరమ్ తేజ్

ప్రజాపక్షం/మల్యాల:జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వామినీ ప్రముఖ తెలుగు సినీ నటుడు సాయి ధరమ్ తేజ శుక్రవారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు,అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదల, వేదమంత్రాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు సాయిధరమ్ తేజకు వేదోక్త ఆశీర్వ చనం అందజేశారు.ఆలయ ఈఓఎస్ అంజనారెడ్డి శాలువా కప్పి సత్కరించి,లడ్డు ప్రసాదం అందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ నీలం రవి,ఆలయ పర్యవేక్షకులు ఉపాధ్యాయ చంద్ర శేఖర్,తదిత రులు పాల్గొన్నారు.

# తమిళనాడు ఎన్నికల్లో కీలక బాధ్యతలు

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆడవాల జ్యోతి లక్ష్మ ణ్కు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సందర్భ ంగా కీలక బాధ్యతలు అప్పగించారు.వెలచ్చేరి శాసనసభ నియో జక వర్గానికి ఎన్నికల సమన్వయకర్తగా ఆమెను అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ నియమించినట్లు ఎఐసిసి వర్గాలు వెల్లడించాయి.ఈ బా ధ్యతల్లో భాగంగా పార్టీ కార్యక్రమాల సమన్వయం, స్థానిక నాయక త్వంతో కలిసి పనిచేయడం, ప్రచార కార్యక్రమాల రూపకల్పన, రైతు లు ,గ్రామీణ ఓటర్లకు పార్టీ విధానాలను చేరవేయడం వంటి కీలక అంశాలను ఆమె నిర్వహించనున్నారు.అదేవిధంగా, కాంగ్రెస్ పార్టీ ఆలోచనలు, రైతు సమస్యలను పార్టీ అభ్యర్థి అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆమె కీలక పాత్ర పోషించనున్నారు.ఈ నియామకం ఆమెకు ఉన్న అనుభవం పార్టీపై ఉన్న నమ్మకానికి గుర్తింపుగా పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆమె నాయకత్వంలో వెలచ్చేరి నియోజ కవ ర్గంలో పార్టీ బలోపేతం అవుతుందని కాంగ్రెస్ నాయకులు ఆశా భా వం వ్యక్తం చేశారు.

# లయన్స్ క్లబ్ సేవలకు విశేష ఆదరణ



ప్రజాపక్షం /మల్లాపూర్ : మల్లాపూర్ శ్రీ కనక సోమేశ్వర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలకు మండల వ్యాప్తంగా ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తుందని క్లబ్ అధ్యక్షుడు రేవెల్లి తిరుపతి అన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం ముత్యంపేట గ్రామంలో రెండవ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కాగా రేకుర్తి కంటి వైద్యులచే పరీక్షలు నిర్వహించగా సుమారు 150 మంది కంటి సమస్యలతో బాధపడుతున్నావు వారిని పరీక్షించి ఉచితంగా మందులను అందించారు. అదేవిధంగా 60 మందికి ఆపరేషన్ నిమిత్తం కరీంనగర్లోని రేకుర్తి ఆసుపత్రికి తరలించినట్లు అధ్యక్షుడు తెలిపారు.అనంతరం గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తేలు నరేష్, ఉప సర్పంచ్ వంగ పోతయ్య, లయన్స్ క్లబ్ కోశాధికారి మిల్కు నవీన్ రెడ్డి, కార్యదర్శి శశికాంత్ రెడ్డి, మెట్పల్లి క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, క్లబ్ సభ్యులు డాక్టర్ మండల స్వామి శివప్రసాద్ నాగిరెడ్డి,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## 50 కేజీల బియ్యం అందజేత

**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ సంబోజి శేఖర్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ఈ మేరకు శుక్రవారం చేయూత వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వారి కుటుంబాన్ని పరామర్శించి 50 కెజిల బియ్యం అందజేశారు. సంబోజి శేఖర్ మరణం పత్రి కారంగానికి తీరని లోటు అని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో చేయూత వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## వ్యక్తికి ఆరేళ్ల జైలు శిక్ష

**ప్రజాపక్షం/చొప్పదండి:** మద్యం తాగి కారు నడుపుతూ ఆటోకు ఢీకొట్టి చొప్పదండికి చెందిన ఒక మహిళ మృతితో పాటు మరో నలుగురికి గాయాలకు కారణమైన వల్లంపాడ్ గ్రామానికి చెందిన నవీన్ అనే వ్యక్తికి ఆరేళ్ల జైలు శిక్ష విధిస్తూ కరీంనగర్ ప్రిన్సిపల్, జిల్లా ప్రధాన న్యాయస్థానం తీర్పునిచ్చారు. విచారణ నిర్వహించిన అప్పటి చొప్పదండి సిఐ నాగేశ్వర్ రావుతో పాటు కేస్ ప్రాసిక్యూషన్ చేసిన ప్రస్తుత సిఐ ప్రదీప్ కుమార్, ప్రస్తుత ఎస్ఐ నరేష్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్‌లను సిపి, రూరల్ ఏసిపి అభినందించారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/గంగాధర:** పేదింటి ఆడపడుచుల పెళ్లిళ్లకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ డబ్బులు సద్వినియోగం చేసుకోవాలని గంగాధర మండలం నారాయణపూర్ సర్పంచ్ దీకొండ బాబ లక్ష్మి మధు అన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు శుక్రవారం గ్రామంలో లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన పోతర్ల పద్మ, సుంకె పుష్ప, మ్యాకల శోభ, క్యాదాసి లలితకు చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో చిలుముల రాజయ్య, రామడుగు మాధవి, మర్రి ఓదెలు, గుర్రం రమేష్, జడ లావణ్య, పత్రి శంకరమ్మ, జిపివో శైలజ, కార్యదర్శి దీపక్‌లున్నారు.

## బిజెపి కో– ఆప్షన్ సభ్యుల ఎంపికకై కమిటీ నియామకం

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగర పాలక సంస్థ పాలకవర్గంలో కో అప్షన్ సభ్యుల ఎంపిక కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ తరుపున కోఅప్షన్ సభ్యులను ఎంపిక చేసేందుకు ఐదుగురు సీనియర్ సభ్యులతో కమిటీని నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నేత్రుత్వంలో ఏర్పాటు చేసిన కమిటీలోనగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, బీజేపీ సీనియర్ నాయకుడు గుజ్జా శ్రీనివాస రావు, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశంలు ఉన్నారు. పార్టీ తరుపున కో అప్షన్ పదవి ని ఆశిస్తున్న సభ్యులను ఈ కమిటీ ఎంపిక చేసి పార్టీకి నివేదించనుంది.

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం: గౌష్ ఆలం

**ప్రజాపక్షం/కరీంనగర్:** రోడ్డు ప్రమాదాల రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ అలైవ్‌రోడ్ సేఫ్టీ క్యాంపెయిన్ అమలుపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ఈ నెల 13 నుండి 18వ తేదీ వరకు వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సీపీ వెల్లడించారు. సమీక్షా సమావేశంలో సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ వారం రోజుల పాటు రోజుకో ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మొదటిరోజు (13వతేది సోమవారం) ప్రతి గ్రామంలో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసి, స్థానిక ప్రజలకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించడం.(14వతేది మంగళవారం) రెండవరోజు వాహనదారులు, విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా సామూహిక ప్రమాణ స్వీకార కార్యక్రమాలు చేపట్టడం. (15వ తేది బుధవారం) మూడవరోజు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, అక్కడ తక్షణమే హెచ్చరిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్స్ మరియు రోడ్ మార్కింగ్స్‌ను పునరుద్ధరించడం.(16వతేది గురువారం) నాల్గవరోజు పాఠశాలల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు, చిన్నతనం నుంచే ట్రాఫిక్ క్రమశిక్షణ అలవడేలా విద్యార్థులకు అవగాహన కల్పించడం. ఆటో, బస్సు, లారీ డ్రైవర్లకు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించి, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ ప్రాముఖ్యతను వివరించడం. (17వ తేది శుక్రవారం) ఐదవరోజు ప్రమాదం జరిగిన మొదటి గంట (గోల్డెన్ అవర్) లో బాధితులకు అందించాల్సిన ప్రాథమిక చికిత్స, సహాయంపై ప్రజలకు వివరించడం. (18వ తేది శనివారం)ఆరవరోజు వారంలో ఒక రోజు ట్రాఫిక్ ఉల్లంఘనలపై జరిమానాలు విధించకుండా, కేవలం కౌన్సెలింగ్ ద్వారా వాహనదారుల్లో మార్పు తీసుకురావడం. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత నిబంధనల పట్ల నిర్లక్ష్యం ప్రాణనష్టానికి దారితీస్తుంది. అరైవ్ అలైవ్‌లక్ష్యం నెరవేరాలంటే డ్రైవర్లు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలి అని పిలుపునిచ్చారు. సురక్షిత ప్రయాణం సుఖమయ జీవనం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన కోరారు.

## నగరాన్ని సమాంతరంగా అభివృద్ధి చేస్తాం

**ప్రజాపక్షం/కరీంనగర్:** నగరాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా శుక్రవారం నగరంలోని 3వ డివిజన్ లో మేయర్ కొలగాని శ్రీనివాస్ పర్యటించారు. విద్యారణ్యపురి రోడ్డు నెంబర్ 1 లో స్థానిక కార్పొరేటర్ సాదవేణి లావణ్య మునిందర్, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి తో కలిసి 8.70 లక్షల నిధులతో సీసీ రోడ్డు కు భూమీ పూజ చేసి పనులు ప్రారంభం చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటించి, సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. సీసీ రోడ్డు నిర్మాణం కు శ్రీకారం చుట్టడం పట్ల స్థానిక డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పనుల ప్రారంభానికి ముఖ్య అతిథిగా వచ్చిన మేయర్ కొలగాని శ్రీనివాస్ ను శాలువాతో సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా మా పాలకవర్గం పని చేస్తుందని స్పష్టం చేశారు. విలీన గ్రామాల, శివారు ప్రాంతాల డివిజన్లను ప్రాధాన్యత గా తీస్కొని, నగరంతో సమానంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా 3వ డివిజన్ విద్యారణ్యపురి లో 8 లక్షల తో సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభం చేశామని తెలిపారు. నగర వ్యాప్తంగా కాలనీల్లో అంతర్గత రోడ్లను, డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్ది, ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. చేపట్టిన పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికాకులను ఆదేశించినట్లు తెలిపారు. కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మా పాలకవర్గం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గాజ రమ శివరాం, ఈఈ శివానందం, ఏఈ గఫూర్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆల్ఫోర్స్'లో ఘనంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సెర్మనీ



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో గల అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో యూకేజీ పూర్తి చేసుకున్న విధ్యార్థులకు గ్రాడ్యుయేషన్ సెర్మనీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా. వి.నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. తదుపరి తరగతికి వెళ్లేటప్పుడు జరుపుకునే ఒక వేడుక అని చెప్పారు. సర్టిఫికెట్ల ప్రధానం, నృత్య ప్రదర్శనను, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వేడుకలకు వెన్నె తెచ్చారు. విధ్యార్థులకు చిన్ననాటి నుంచే సృజనాత్మకతతో పాటు విషయాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని, విషయ పరిజ్ఞానం తెలుసుకోవడానికి పరీక్ష నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

## టిఎన్‌జిఓస్ సభ్యత్వ నమోదు

### జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ వెల్లడి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా టిఎన్‌జిఓ అధ్యక్షుడు బొంకూరి శంకర్ నాయకత్వంలో శుక్రవారం రోజున 2026 సంవత్సరానికి గాను టిఎన్‌జిఓ సభ్యత్వ కార్యక్రమము పంచాయత్ రాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్, మిషన్ భగీరథ గ్రిడ్ డిపార్ట్‌మెంట్, మిషన్ భగీరథ ఇంట్రా డిపార్ట్మెంట్, వెటరినరీడిపార్ట్‌మెంట్, జిల్లా విద్యాధికారి కార్యాలయం, సూపరిండెంట్ ఇంజనీరింగ్ఇరిగేషన్ డివిజన్ కార్యాలయాలలో ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా శాఖలకు చెందిన నాన్‌గెజిటెడ్ ఉద్యోగులందరూ ఉత్సాహంగా పాల్గొని తమడిపార్ట్‌మెంట్ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవడం జరిగింది.ఈ ఈ సందర్భంగా బొంకూరి శంకర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విభాగాల వారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఉంటుందని, 80 సంవత్సరాల చరిత్ర కలిగిన టిఎన్జీఓ సంఘం లో భాగస్వామ్యం కావడం మన హక్కులను పరిరక్షించుకోవడేమని, పెద్దపల్లి జిల్లాలోని ప్రతి ఒక్క నాన్ గెజిటెడ్ ఉద్యోగి రెండు వందల రూపాయలు చెల్లించి టిఎన్జీఓ సభ్యత్వాన్ని స్వీకరించాల్సిందిగా, తద్వారా ఉద్యోగుల సమస్యల పట్ల ప్రశ్నించే గొంతుకగా మారాలని, టీఎన్జీఓ సంఘ నాయకత్వం ఎప్పుడు ప్రాథమిక సభ్యునికే మొదటి ప్రాధాన్యతనిస్తూ సమస్యల సాధనకు కృషి చేస్తుందని, ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంను విజయవంతం చేయాలని, తదుపరి జరిగే జిల్లా టీఎన్జీఓ ఎన్నికల్లో ఆసక్తిగా పాల్గొని ఉద్యోగుల పక్షాన నిలిచి, ఉద్యోగుల సమస్యలను సాధించే మంచి నాయకుల్ని ఎన్నుకొనుటలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాన్ గెజిటెడ్ అధికారులందరూ బొంకూరి శంకర్ చేతుల మీదుగా సభ్యత్వ రసీదును అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. టీఎన్జీఓ జిల్లా సంఘ భాద్యులు కొమురయ్య, పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు అయిరెడ్డి సందీప్ రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్, ప్రేమ్ సాగర్, పంచాయత్ రాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు , మిషన్ భగీరథ డిపార్ట్మెంట్ ఉద్యోగులు అనిత, రాకేష్, రమేష్, శంకర్, వెటరినరీ డిపార్ట్మెంట్ ఉద్యోగులు సౌమ్య, సాధిక్, జహీర్, మంగ, జిల్లా విద్యాధికారి కార్యాలయం ఉద్యోగులు సురేందర్, శ్రీధర్, అమృత, స్నేహ, సూపరిండెంట్ ఇంజనీరింగ్ఇరిగేషన్ డివిజన్ ఉద్యోగులు కొమురయ్య, ఉమ, ప్రమోద్,తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచికార్యదర్శిగా రంగు శ్రీను,సహాయ కార్యదర్శిగా మాదన మహేష్

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కమిటీ సమావేశం గురువారం సాయంత్రం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు కామ్రేడ్ సంకె అశోక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు కామ్రేడ్ వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కొరిమి రాజ్ కుమార్ లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.ఇట్టి సమావేశంలో సేవ్ సింగరేణి పోరు జాత కార్యక్రమం పై మరియు సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాట కార్యక్రమం గురించి చర్చ జరిగింది.అనంతరం అర్జీ వన్ బ్రాంచి కమిటీ కి బ్రాంచి కార్యదర్శి గా కామ్రేడ్ రంగు శ్రీను ను మరియు సహాయ కార్యదర్శి గా కామ్రేడ్ మాదన మహేష్ లను ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా యూనియన్ బాధ్యతలు స్వీకరించిన నాయకులకు ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్ మరియు పిట్ కార్యదర్శులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రంగు శ్రీను, మాదాన మహేష్ లు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఏఐటీయూసీ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు ఏఐటియుసి బలోపేతానికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## పుష్కరాల ఘాట్లకు వెళ్లే రోడ్లను పూర్తి చేయాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పుష్కరాల ఘాట్లకు వెళ్లే రోడ్లను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం ఇంజనీరింగ్ చీఫ్ మోహన్ నాయక్ తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని మంథని, గోలివాడ గోదావరిఖని పుష్కర ఘాట్లకు వెళ్లే రహదారులను నిర్ణీత సమయంలో గా పూర్తి చేయాలని, పుష్కరాల సమయంలో గోలివాడ సమ్మక్క సారలమ్మ జాతర వద్ద రోజుకు 30 వేల మంది భక్తులు వస్తారనే అంచనా తో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర వద్ద 50 శాతం వరకు శాశ్వత పనులు పూర్తయ్యాయని, అక్కడ స్నానాల ఘాట్, కళ్యాణ కట్ట, పిండె ప్రధానం చేసే స్థలం ఏర్పాటు పనులు రోజుకు లక్ష మంది భక్తులు వచ్చిన తట్టుకునేలా చేపట్టాలన్నారు. మంథని గౌతమేశ్వర ఆలయం వద్ద గోదావరి పుష్కరాల సమయంలో రోజుకు రెండు లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని , ఇక్కడ సురబండేశ్వర్ స్వామి టెంపుల్ నుండి శివాలయం వరకు ఉన్న ఘాట్ వద్ద ఇన్ & ఔట్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. మంథని పట్టణంలోని అన్ని దేవాలయాలకు అంతర్గత రోడ్లు నిర్మించాలని, పుష్కర ఘాటు వద్ద హెలి ప్యాడ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఇఇ బావ్ సింగ్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## మర్లవాడలో ఆర్టీసీ బస్సుల రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి పట్టణంలోని 14 వార్డులోని మర్లవాడలో ఆర్టీసీ బస్సుల రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సంగ నరేష్ కరీంనగర్ డిపో మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. మర్లవాడలో సుమారు 80 కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ ఆ ప్రాంతంలో ఆర్టీసీ బస్సులు ఆగే సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థులు, మహిళలు, వృద్దులు ప్రతి రోజు సుమారు 2 కిలోమీటర్లు నడిచి చొప్పదండి ఎన్టీఆర్ చౌరస్తా చేరుకోవాల్సి వస్తోందన్నారు.

## హుండీ ఆదాయం 20,39,551

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో 2026 బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీ లెక్కింపు కరీంనగర్ డివిజన్ పరిశీలకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చి 17 నుంచి ఏప్రిల్ 10 వరకు మొత్తం 24 రోజుల కాలానికి గాను హుండీ ద్వారా రూ. 20,39,551 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అదే విధంగా భక్తులు సమర్పించిన మిశ్రమ బంగారం 6 గ్రాములు, మిశ్రమ వెండి 225 గ్రాములు కూడా లెక్కించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి కందుల సుధాకర్, అర్చకులు శేషం వంశీధరాచార్యులు, మడికొండ నవీన్ కుమార్ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## 19న తెలంగాణ మోడల్ పాఠశాలల ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** తెలంగాణ మోడల్ పాఠశాలల్లో 6వ తరగతి నుండి 10వ తరగతి (2026–27) ప్రవేశ పరీక్ష 19 ఏప్రిల్ 2026 (ఆదివారం) నాడు ఈ క్రింది విధంగా నిర్వహించబడునని తెలంగాణ మోడల్ స్కూల్, కండ్లపల్లి, ప్రిన్సిపాల్ డి.సరిత దేవి తెలిపారు. 6వ తరగతి: ఉదయం 10.00 నుండి మధ్యాహ్నం 12.00 వరకు, 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు: మధ్యాహ్నం 2.00 నుండి సాయంత్రం 4.00 వరకు ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను 10 ఏప్రిల్ 2026 నుండి telanganams.cgg.gov.in వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని ఆన్లైన్లో దరఖాస్తులు సమర్పించిన విద్యార్థులందరూ నాగిరెడ్డిపేట, గోపాల్పేటలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో హాల్ టికెట్ చూపించి ప్రవేశ పరీక్షకు హాజరు కావాలి. అభ్యర్థులు ఎగ్జామ్ ప్యాడ్, హాల్ టికెట్, బాల్ పెన్నులు, నీటి సీసా మినహా మరే ఇతర సామాగ్రిని పరీక్షా హాలులోకి తీసుకురావడానికి అనుమతించబడరు అని తెలంగాణ మోడల్ స్కూల్, కండ్లపల్లి, జగిత్యాల ప్రిన్సిపాల్డి.సరిత దేవి ఓ ప్రకటనలో తెలిపారు.

## పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలి

**ప్రజాపక్షం/రాయికల్ :** చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు రోగ నిరోధక శక్తికి,మానసిక వికాసానికి సమతుల్యమైన ఆహారం అందించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ అనుహ్య అన్నారు.శుక్రవారం రాయికల్ మండలం ఇటిక్యాల సెక్టార్ లోని మూడవ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల పెరుగుదలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ పుట్టినప్పటినుండి నుండి 6 సంవత్సరాల వయస్సు గల చిన్నారుల పెరుగుదల వివరాలు తీసుకొని పౌష్టిక ఆహారం, ఆహార లోపం దాని ప్రభావాల గురించి వివరించారు. కాగా చిన్నారులకు సమతుల ఆహారం ఇవ్వడం వల్ల మానసిక శారీరక ఎదుగుదలపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయని,చిన్నతనంలోనే ఆరోగ్యకరమైన సమతుల్య ఆహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీరటి శ్రీనివాస్,వార్డు సభ్యురాలు మలానీ,అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు,బాలింతలు,తదితరులు పాల్గొన్నారు.

## భూసర్వే-రీ సర్వేపై రెండు గ్రామాలలో గ్రామ సభ

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూసర్వేరీ సర్వే కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూర్, కేశాపూర్ గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్. లత హాజరయ్యారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 1923 యాక్ట్ ప్రకారం భూముల రీ సర్వే విధానం, ప్రక్రియలపై రైతులకు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెట్పల్లి ఆర్డీవో నరసింహారావు, తహసిల్దార్ బిఎస్ఎస్. వరప్రసాద్, జిల్లా సర్వే భూమి కొలతల అధికారి,డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే తదితర అధికారులు, ఆర్ ఐ లు, జి పి ఓ లు, రెండు గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు సామాన్యులకేనా మున్సిపల్ అధికారులకు వర్తించవా?

### కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్

**ప్రజాపక్షం /కోరుట్ల :**కోరుట్ల మున్సిపల్ కమీషనర్ రవీందర్ ఆదేశాల మేరకు కోరుట్ల పట్టణంలోని రెస్టారెంట్లు, హోటల్స్, మరియు టిఫిన్ సెంటర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారికీ నిలువ ఉంచిన ఆహార పదార్థాలను స్వాధీన పరుచుకొని 12000/ రూపాయలు జరిమానాలు విధించడంతో పాటు బట్ట సంచుల వాడకంపై అవగాహన కల్పించడం జరిగింది. ఇక్కడ వరకు బాగానే ఉంది. మున్సిపల్ అధికారులు ఇందులో పైన చిత్రంలో కనిపించే అధికారులు వారి చేతిలో ఫ్లెక్సీ వాడడం జరిగింది. ఫ్లెక్సీ అనేది ప్లాస్టిక్ కాదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫ్లెక్సీ ద్వారా హాని లేదా అని ప్రశ్నిస్తున్నారు?. వీటికి కోరుట్ల పూరపాలక సంఘం కమిషనరే సమాధానం చెప్పాలి. ప్రజలకు అవగాహన కల్పించడానికి వీరు ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ఇకముందు వాడకపోవడం మంచిదని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.సామాన్య ప్రజలు తప్పు చేస్తే జరిమానాలు విధిస్తున్న అధికారులు వారు నిబంధనలు ఉల్లంఘించినప్పుడు ఉన్నతాధికారులు వారిపై చర్యలు తీసుకోవడం లేదు ఎందుకు అని జరిమానాలు కట్టిన వారు ప్రశ్నిస్తున్నారు.అలాగే ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చెయ్యని దుకాణా దారులకు ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని చెప్పడం జరిగింది.దీనిని ఉదేశించి మున్సిపల్ కమీషనర్ రవీందర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను పూర్తిస్థాయిలో నిషేదించాలి లేనియెడల భారీ జరిమానాలు విధించడంతో పాటు దుకాణాలు సీజ్ చేయడం జరుగుతుంది మరియు ట్రేడ్ లైసెన్స్ లేని వారు వెంటనే తీసుకోవాలి అని ఆయన తెలపడం జరిగింది. వ్యాపార కార్యకలాపాలతో వెలువడిన చెత్తను తడి, పొడి,హానికరక చెత్తగా వేరు చేసి షాప్ వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని తెలిపారు లేనిచో SWM2019 చట్టం ప్రకారం జరిమానా విధించబడును.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్ , ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, రికార్డ్ అసిస్టెంట్ జగదీష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్,హేమంత్, జవాన్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్

### మాజీ నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** యువత ఆన్లైన్ గేమింగ్ బెట్టింగ్ ఇతర వ్యసనాల పట్ల ప్రభావితం కాకుండా క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే కెసిఆర్ కప్ 2026 టోర్నమెంటును నిర్వహిస్తున్నామని మాజీ నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు అన్నారు. శుక్రవారం బిఆర్ఎస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేసీఆర్ కప్2026 సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో వివిధ వార్డుల నుండి జట్ల వారిగా క్రికెట్ టోర్నమెంట్ ఆడేందుకు డ్రా తీసి ప్రణాళికను ప్రకటించి టోర్నమెంట్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కెసిఆర్ ఆశయాలకు అనుగుణంగా కేటీఆర్ ఆలోచనలతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని అన్నారు. యువత ఈ టోర్నమెంట్ లో పాల్గొని క్రీడారంగంలో తమ ప్రతిభను చూపిస్తూ అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, మున్సిపల్ వాయిస్ చైర్మన్ దార్ల సందీప్, మాజీ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్, వార్డ్ కౌన్సిలర్లు బుర్ర మల్లికార్జున్, గంట్యాల శ్రీనివాస్, కల్లూరి లతా రాజు, ఆకుల చిన్న, కుంభాల మల్లారెడ్డి,రామ్మోహన్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములవాడ రూరల్ మండల పరిధిలోని యాబై నాలుగు మంది లబ్ధిదారులకు పదిహేడు లక్షల ఎనభై వేల విలువ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు.

## పరారీలో ఉన్న నిందితుడి రిమాండ్

### ఎస్పి మహేష్ బి. గితే.



**ప్రజాపక్షం /ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లి గ్రామానికి చెందిన బోయిని ఆంజనేయులు (27), తండ్రి బాల నరసయ్య, 2007 సంవత్సరంలో భాగ్యలక్ష్మి ని వివాహం చేసుకున్నాడు.వీరికి ఇద్దరు కుమార్తెలు శ్రీనిధి (5 సంవత్సరాలు), నైపున్య (2 సంవత్సరాలు) ఉన్నారు. 2012 సంవత్సరంలో భాగ్యలక్ష్మి మూడవసారి గర్భవతిగా ఉన్న సమయంలో,మళ్లీ అమ్మాయి పుడుతుందని అనుమానంతో భర్త ఆంజనేయులు,అలాగే అత్తమామలు ఆమెను మానసికంగా,శారీరకంగా వేధించాగా,అట్టి వేధింపులను భరించలేక భాగ్యలక్ష్మి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంది.ఈఘటనపై 2012లో ఆంజనేయులుపై కేసు నమోదు చేయబడింది. అప్పటి నుండి ఆంజనేయులు పరారీలో ఉండగా దీంతో *న్యాయస్థానం అతనిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీచేయగా* జిల్లా టాస్క్ఫోర్స్, ముస్తాబాద్ పోలీసులు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా హైదరాబాద్ లో అదుపులోకి తీసుకొని నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు జిల్లా ఎస్పితెలిపారు.

**పోలీసులకు ఎల్లవ్వ కృతజ్ఞతలు..**

భాగ్యలక్ష్మి తల్లి ఎల్లవ్వ తన కూతురు మరియు మనవరాళ్లను హత్య చేసిన అంజనేయులు ను పట్టుకోవడంలో 14 సంవత్సరాల నుండి న్యాయం కోసం తిరుగుతున్నానని జిల్లా ఎస్పీ కి ఈ నెల 6 వతేదీన పిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఎస్పీ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి కేవలం మూడు రోజుల్లోనే నిందితుడు అంజనేయులను అరెస్ట్ చేయడం పట్ల బాధిత కుటుంబానికి న్యాయం జరిగే దిశగా వేగంగా ముందడుగు పడింది.ఈసందర్భంగా ఎల్లవ్వ జిల్లా పోలీసుల తక్షణ స్పందనకు,నిందితుడిని త్వరగా పట్టుకోవడానికి కృషి చేసిన ప్రత్యేక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన టాస్క్ఫోర్స్ ఇన్స్పెక్టర్ నటేష్, ముస్తాబాద్ ఎస్.ఐ గణేష్, టాస్క్ఫోర్స్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## నిరుపేదల పాలిట వరం సిఎంఆర్ఎఫ్ పథకం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** సిఎం సహాయానిది పథకం నిరుపేదల పాలిట వరం లాంటిదని మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా సంతోష్ అన్నారు.జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని మల్లన్నపేట గ్రామానికి చెందిన బొల్లె మల్లయ్య, మోరాపెల్లి మనోహర్, ముత్యాల మణిదీప్, బుర్రవేని తిరుపతి లు వివిధ అనారోగ్య కారణాల వల్ల హాస్పిటల్ లో చికిత్స పొందగా ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఏఎంసీ చైర్మన్ భీమా సంతోష్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి శుక్రవారం రోజు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ... అనారోగ్యల బారిన పడి ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఆర్థికంగా భరోసా కల్పిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఏప్రిల్ 19న తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం /పెగడపల్లి :** తెలంగాణ మోడల్ పాఠశాలల్లో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు (202627 విద్యా సంవత్సరం) ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 19 (ఆదివారం) నాడు నిర్వహించనున్నట్లు పెగడపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా సమయాలు 6వ తరగతికి ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు. 7వ నుండి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు. నిర్వహించనున్నట్లు, ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్ టికెట్లను ఈరోజు (ఏప్రిల్ 10) నుండి telanganams.cgg.gov.in వెబ్సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఆన్లైన్లో దరఖాస్తు చేసిన విద్యార్థులందరూ పెగడపల్లిలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి హాల్ టికెట్లతో హాజరు కావాలని ఆయన సూచించారు. పరీక్ష 100 ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. సమాధానాలను OMR షీట్లపై బాల్ పెన్నుతో గుర్తించాల్సి ఉంటుందని విద్యార్థులు పరీక్షా కేంద్రానికి కేవలం ఎగ్జామ్ ప్యాడ్, హాల్ టికెట్, బాల్ పెన్నులు మరియు నీటి సీసా మాత్రమే తీసుకురావాలి. ఇతర సామాగ్రికి అనుమతి లేదని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం /పెగడపల్లి :** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల ,ట్రాన్స్జెండర్ల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ శుక్రవారం పెగడపల్లి మండలంలో ఇటీవల వివిధ కారణాలతో ఇబ్బందుల్లో ఉన్న పలువురు కాంగ్రెస్ నాయకులు,గ్రామస్తుల కుటుంబాలను పరామర్శించారు.దేవి కొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రటరీ గోగూరి సతీష్ రెడ్డి తండ్రి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి నివాసానికి చేరుకున్న మంత్రి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చాట్ల విజయభాస్కర్ కుమారుడు విక్రమ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న మంత్రి, వారిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఐతుపల్లి గ్రామానికి చెందిన పెగడపల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తడగొండ తిరుపతి తండ్రి లింగయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని కూడా మంత్రి పరామర్శించారు.ఈ పరామర్శ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, సర్పంచ్,ఉప సర్పంచ్ లు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,ఇతర ముఖ్య నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## జనగణన ఎన్యుమరేషన్ బ్లాక్ల గుర్తింపుపై సమావేశం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జనగణన లో భాగంగా గ్రామ పంచాయతీల్లో ఎన్యుమరేషన్ బ్లాక్ లను మ్యాప్పై గుర్తించే కార్యక్రమాన్ని ఆయా పంచాయతీ కార్యదర్శులతో తహసిల్దార్ బిఎస్ఎస్ వరప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో బ్లాక్లను, ప్రారంభ స్థానాలను గుర్తించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె. ప్రసాద్, ఆర్ఐలు రేవంత్ రెడ్డి ,సామల రమేష్, జీపీఓలు ,సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులతో సబ్ కలెక్టర్ భేటీ

ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ మండలంలోని మాంజీరా లిఫ్టు ఇరిగేషన్ భూసేకరణ గురించి మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి రైతులతో భేటీ అయ్యారు. ఇందులో భాగంగా వడ్డేపల్లి గ్రామంలో 12.14 ఎకరాలు 11 మంది రైతులు, మల్లూరులో 81 మంది రైతులకు చెందిన 11.01 ఎకరాలు, జక్కాపూర్ గ్రామంలో ముగ్గురు రైతులకు చెందిన 0.28 ఎకరా భూముల గురించి సదరు రైతుల అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భుజంగరావు, ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పిట్లం ఎస్సైని కలిసిన లైవ్ రాష్ట్ర కోఆర్డినేటర్

ప్రజాపక్షం/పిట్లం: పిట్లం పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా ఎస్సైగా వచ్చిన ఆంజనేయులును లంబాడాల ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ కాట్రోత్ రవీందర్‌నాయక్ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైకి పుష్పగుచ్ఛం అందజేసి తమ శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో పాటు ఎస్సైని కలిసిన వారిలో రాంపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ, పిట్లం మండల లైవ్ అధ్యక్షుడు సునావత్ శ్రావణ్ తదితరులు ఉన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు సహాయ సహకారాలు కావాలి

పిట్లం ఎస్ఐ ఆంజనేయులు

ప్రజాపక్షం/పిట్లం: పిట్లం మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలు కావాలని పిట్లం ఎస్సై ఆంజనేయులు అన్నారు. ప్రజల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు ప్రతీ ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు. శుక్రవారం నూతన ఎస్సైని పిట్లం గ్రామ సర్పంచు కుమ్మరి చంద్రశేఖర్ కలిసి తమ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిట్లం ఉపసర్పంచు అవేజ్ బేగ్, ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం మాజీ చైర్మెన్ శపథంరెడ్డి, పట్టణ సీనియర్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## సిసిరోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచు

ప్రజాపక్షం/పిట్లం: మండలంలోని చిల్లర్గి గ్రామంలో 35 లక్షల మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో గ్రామ సర్పంచు రాధ మురళీగౌడ్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సధుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని, ప్రజలకు వర్షాకాలంలో బురద సమస్య తీర్చేలా సీసీరోడ్డు పనులు చేపట్టినట్లు చెప్పారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తామన్నారు. గ్రామ కార్యదర్శి వినోద్, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రకృతి వ్యవసాయంతోనే అధిక లాభాలు

జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ



ప్రజాపక్షం / జన్నారం : రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ పద్ధతిలో సాగు చేయడం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొనకల్ రైతు వేదికలో శుక్రవారం జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు వేయడం, జీవామృతం, గోమూత్రం, వర్మీ కంపోస్ట్ వంటి సహజ ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా సాగు ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని వివరించారు. దీనివల్ల నేల ఆరోగ్యం మెరుగుపడి భూసారం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపల్లి, లింగయ్యపల్లి, ధర్మారం గ్రామాల నుంచి ఎంపికైన సుమారు 125 మంది రైతులకు ప్రకృతి సాగుపై అవగాహన కల్పించారు. మంచిర్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణ, జన్నారం వ్యవసాయ అధికారి జి. అంజిత్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు మల్యాల త్రిసంధ్య, దివ్య, లవన్, ధర్మారం ఉప సర్పంచ్ మహేందర్, కృషి సఖీలు జక్కుల రజిత, గోగు అంజలి, రైతులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు



ప్రజాపక్షం / కాగజ్ నగర్ : పంట మార్పిడి చేపట్టి ఆయిల్ పామ్ సాగు చేయడం ద్వారా రైతులు మంచి దిగుబడులు, అధిక లాభాలు సాధించాలని ఏడిఏ మనోహర్ అన్నారు. శుక్రవారం కాగజ్ నగర్ మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు పంట మార్పిడిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట మార్పిడి చేయడం వల్ల భూసారం పెరుగుతుందని, సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు రైతులకు ఎంతో లాభదాయకమని వివరించారు. వరి పంట సాగుకు ముందు జనుము, జీలుగు పంటలు వేసి కలియదున్నడం వల్ల భూమి నాణ్యత మెరుగవుతుందని తెలిపారు. ఏవో రామకృష్ణ మాట్లాడుతూ యూరియా అధిక మోతాదులో వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని, పర్యావరణానికి హాని కలుగుతుందని చెప్పారు. యూరియా వాడకం తగ్గించి నానో ఎరువులు, జీవామృతం, వేప నూనె వంటి సేంద్రియ పదార్థాలు వినియోగించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, ఆత్మ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# దుప్పి మాంసం పంచుకున్న ముగ్గురికి రిమాండ్



ప్రజాపక్షం / సిర్పూర్ టి : పెద్దబండ అటవీ ప్రాంతంలో రైలు ప్రమాదంలో మృతి చెందిన చుక్కల దుప్పిని ముక్కలుగా కోసి మాంసం పంచుకున్న ఘటనలో ముగ్గురు వ్యక్తులకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. సిర్పూర్ రేంజ్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రైలు ఢీకొని చుక్కల దుప్పి మృతి చెందగా ఆ విషయాన్ని అధికారులకు తెలపకుండా కొందరు వ్యక్తులు మాంసాన్ని వాటాలు పంచుకున్నారు. సమాచారం అందుకున్న అధికారులు విచారణ చేపట్టి నలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో రుద్రారం గ్రామానికి చెందిన ఎల్లందుల రాజశేఖర్, శనిగరపు కొమురయ్య, మహారాష్ట్రకు చెందిన చౌదరి అంబదాస్‌లను అదుపులోకి తీసుకుని సిర్పూర్ టి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. విచారణ అనంతరం న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించగా, ఈస్గాం గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి బుర్ర చిరంజీవి పరారీలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. రోడ్డు, రైలు ప్రమాదాల్లో వన్యప్రాణులు మృతి చెందితే వెంటనే అటవీ శాఖకు సమాచారం అందించాలని ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓ ప్రవీణ్ కుమార్ సూచించారు. వన్యప్రాణులను మాంసం కోసం వినియోగించినా, దాచిపెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కేసు దర్యాప్తులో డియార్వో శశిధర్ బాబు, బీట్ ఆఫీసర్లు రవీనా, అరవింద్, షాహిద్, సంతోష్ పాల్గొన్నారు.

## జాగృతిలోకి 20 మంది నాయకులు, యువకుల చేరిక

ప్రజాపక్షం / కాసిపేట : మంచిర్యాల జిల్లా కాసిపేట మండలానికి చెందిన పలువురు నాయకులు, యువకులు గురువారం తెలంగాణ జాగృతిలో చేరారు. హైదరాబాద్ లోని జాగృతి కార్యాలయంలో మండల అధ్యక్షుడు సోదరి సురేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కండువా కప్పి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్ర సమస్యలపై కవిత చేస్తున్న పోరాటం, సామాజిక తెలంగాణ లక్ష్యంతో ఆకర్షితులై తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు మండల అధ్యక్షుడు సురేష్ తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేయబోయే పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని పేర్కొన్నారు. కోమటిచెను గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఎం.డి. కమలతో పాటు గెడం, వసంత, సిద్దం సుమాదేవి, కత్తరసల రాజేశ్వరి, అజయ్, రత్నం రాజేందర్, ఎర్ర భీమన్న, చందనగిరి అంజలి, జ్యోతి, జడి కళావతి పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్‌గా బక్కయ్య బాధ్యతల స్వీకారం

ప్రజాపక్షం / జన్నారం : జన్నారం మండల నూతన తహసీల్దార్‌గా జి. బక్కయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయన తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ముఖ్యంగా భూ సమస్యలు, ధరణి సంబంధిత సేవలు, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రైతులకు సంబంధించిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందిస్తామని బక్కయ్య స్పష్టం చేశారు. మండల అభివృద్ధి కోసం అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## ఘనంగా ప్రపంచ.. హోమియోపతి దినోత్సవం

ప్రజాపక్షం/ ఆదిలాబాద్ అర్బన్: డాక్టర్ సామ్యూల్ హానిమన్ జయంతి సందర్భంగా హమాలీవాడ అర్బన్ పిహెచ్‌సిలో ప్రపంచ హోమియోపతి దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ రాజర్షి షా, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష జ్యోతి ప్రజ్వలన చేసి మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సంప్రదాయ హోమియో వైద్యం వ్యాధులకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ రోహిత్, కౌన్సిలర్ గంట జీవన్, ఆయుష్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సదస్సును విజయవంతం చేయాలి

ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్

ప్రజాపక్షం/ ఉట్నూర్: ఈ నెల 15, 16 తేదీల్లో ఉట్నూర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి సదస్సును విజయవంతం చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ కోరారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తొలిసారిగా జాతీయ స్థాయి సదస్సును కేబీ కాంప్లెక్స్‌లోని పీఎంఆర్‌సీ భవనం, డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల అభివృద్ధి, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, పర్యావరణ అంశాలపై ఈ సదస్సు జరుగుతుందని వివరించారు. దీనికి ద్రవిడియన్, ఇందిరాంధీ జాతీయ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ఎంపీ గోడెం నగేష్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ యువరాజ్ మార్మాట్ పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సుకు అధ్యాపకులు, అభ్యర్థులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతీ గిరిజనుడికీ సంక్షేమ పథకాలు అందాలి : ఐటీడీఓ పీఓ

ప్రజాపక్షం/ ఉట్నూర్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి గిరిజనుడికి అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో అన్ని విభాగాల అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భగా పీఓ మాట్లాడుతూ, విద్యా, వైద్యం, వ్యవసాయం, అటవీ హక్కుల వంటి కీలక విభాగాల్లో పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచి, గిరిజన ప్రాంతాల్లో సేవల నాణ్యతను మెరుగుపరచాలని తెలిపారు. ముఖ్యంగా భూ వివాదాలు, త్రాగునీరు, గిరిజన గురుకులాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బుద్ధికొండలో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

ప్రజాపక్షం/ నేరడిగొండ: పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుద్ధికొండ గ్రామంలో శుక్రవారం బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఏలేటి మహేందర్ రెడి అధ్యక్షతన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తల్లిబిడ్డల ఆరోగ్యం, పౌష్టికాహారం ప్రాముఖ్యతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బాలికల విద్యకు, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలున, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌కు హాల్ టికెట్లు విడుదల

ప్రజాపక్షం/నిజాంసాగర్: కామారెడ్డి జిల్లాలో ఈనెల 19న తెలంగాణ మోడల్ స్కూల్‌లో 5వ తరగతిలో ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని కామారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆయన మాట్లాడుతూ 7 వ తరగతి నుండి 10వ తరగతులలో మిగిపోయిన ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈఓ వెల్లడించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సంబంధిత తెలంగాణ మోడల్ స్కూల్ వెబ్ సైట్ ద్వారా ఈనెల 10వ తేదీ నుండి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు.

## నంది రామయ్యను పరామర్శించిన కౌన్సిలర్ తొడసం ఇందిర

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** గత కొన్ని రోజులనుండి అనారోగ్యానికి గురైన సీపిఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్యను ఖానాపూర్ పట్టణ 12 వార్డు కౌన్సిలర్ తొడసం ఇందిర పరామర్శిలంచారు.నంది రామయ్య నివాసానికి వెళ్లి కలిసి ఆరోగ్య విషయాలను,పరిస్థితిన అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట ఆవార్డు నాయకులు దాదా బాయ్,తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/కుంటాల :** మొక్కజొన్న పంటలను వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి డిమాండ్ చేశారు.శుక్రవారం మండల కేంద్రంలో రైతుల సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు,రైతులు కలిసి తహసీల్దార్ కమల్ సింగ్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ఆలస్యమవుతున్న కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.రైతులు పండించిన పంటకు సరైన మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసులకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కల్లూరు సర్పంచ్ పెంటవార్ దశరత్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్‌ను సన్మానించిన పద్మశాలి సంఘం

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ లను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సాన్మానించారు.శుక్రవారం పట్టణంలోని తిమ్మాపూర్ పద్మశాలి సంఘం భవనంలో ఆ సంఘం సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి మాట్లాడారు.కులవృత్తుల పైన ఆధారపడే కుటుంబాల నుంచి ప్రస్థానం ప్రారంభించి మున్సిపల్ చైర్మన్ పదవిని అధిరోహించడం సంఘానికి గర్వ కారణమన్నారు.పట్టణ ప్రజలకు సేవలందించాలని కోరారు.మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పద్మశాలి సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు రాజా మొగిలి.ఉపాధ్యక్షుడు అంకం శంకర్,అడేపు శంకర్,రాజేశ్వర్,లక్ష్మి రాజం, లక్ష్మణ్,నరహరి,నారాయణ, ధత్రాత్రి ,భీమేశ్వర్,బీమలింగు, గణేష్ పాల్గొన్నారు.

## హత్యకేసులో ఐదుగురి అరెస్ట్

**ప్రజాపక్షం/ముప్కాల్ :** పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోచంపాడ్‌లో గత సోమవారం రిషిక్ అనే యువకున్ని హత్య చేసిన ఘటనలో ఐదుగురిని నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సిఐ జాన్ రెడ్డి, ఎస్సై సుహాసిని తెలిపారు.




## పోషకాహారంపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** గర్భిణీలు, బాలింతలు పోషకాహార ప్రాముఖ్యతను గుర్తించి ఆరోగ్యంగా ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మ అన్నారు. సిర్పూర్ మండలంలోని జైభీమ్ నగర్, మన్నెగూడ, హీరాపూర్, సిర్పూర్ 2, స్టేషన్ ఏరియా, చీలపెల్లి అంగన్వాడీ కేంద్రాలలో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో షెడ్యూల్ ప్రకారం పోషణ్ పక్షం కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. మహిళలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అంగన్వాడీ సిబ్బంది గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన సమతుల్య ఆహారం, పిల్లల ఎదుగుదలలో పోషకాహారం పాత్ర గురించి వివరించారు. ముఖ్యంగా చిన్నపిల్లల మెదడు అభివృద్ధికి అవసరమైన పోషకాలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై తల్లులకు అవగాహన కల్పించారు. నిత్యం పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల అరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## నీటి కష్టాలు తీర్చాలని అధికారులకు వినతి




**ప్రజాపక్షం / తిర్యాని :** కొమురం భీం జిల్లా తిర్యాని మండలంలోని గంభీరావుపేట ఎస్సి కాలనీ ప్రజలు త్రాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండాకాలం కావడంతో రోజువారీ అవసరాలకు కూడా సరిపడా నీరు లభించక మహిళలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ ప్రజలు సంఘటితమై శుక్రవారం ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వేసవిలో తమ పరిస్థితి దారుణంగా మారుతోందని, వెంటనే బోర్‌వెల్ ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామస్తుల సమస్యలను విన్న ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. సమస్య తీవ్రతను గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే బోర్‌వెల్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎండాకాలం మరింత ఉధృతం కాకముందే అధికారులు స్పందించి తమకు ఉపశమనం కల్పించాలని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మౌనిక, రాజశేఖర్, సతీష్, రవి, సమ్మయ్య, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## డిహెచ్‌పిఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి




**ప్రజాపక్షం / కాసిపేట :** వరంగల్ నగరంలో ఏప్రిల్ 17, 18 తేదీలలో నిర్వహించనున్న దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రెండో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నిర్మాణ బాధ్యులు దాగం మల్లేష్ కోరారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రంలో మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభలకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జాడి పోచన్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు భూపెల్లి శ్రీనివాస్, నాయకులు దుర్గం సుధాకర్, రాజేందర్, నగురారపు సుధాకర్, దుర్గ ప్రసాద్, శ్రీనివాస్, భీమయ్య, నారాయణ పాల్గొన్నారు.

## లోకేశ్వరం లో హిందూ సమ్మేళన కార్యక్రమం




**ప్రజాపక్షం/లోకేశ్వరం :** మండల కేంద్రంలో నీ లోకేశ్వరం ఉప మండలం కల్లూరు ఖండంలోని హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి భువనేశ్వరి పీఠం గన్నవరంకి చెందిన పూజ్య శ్రీ శ్రీశ్రీ కమలానంద భారతి స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు ఆధ్యాత్మిక ఉపన్యాసం అందించారు.ఈ కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా వందేమాతరం గీతాలాపన హనుమాన్ చాలీసా కుమార్చన పిల్లలచే సంస్కృతి పాటలతో నృ చేశారు.అనంతరం స్వామీజీ మాట్లాడుతూ సందేశంలో హిందూ ధర్మ పరిరక్షణ,సంస్కృతి విలువలు,సమాజంలో ఐక్యత అవసరాన్ని వివరించారు.ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ హిందువులు ఐక్యంగా ఉండాలని మన సంస్కృతిని కాపాడుకోవాలని మరిన్ని విషయాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు నల్ల రమేష్ మండల అధ్యక్షుడు బోడికే సాయన్న లోకేశ్వరం సర్పంచ్ కపిల్ అసెంబ్లీ కన్వీనర్ సుమన్ రాజేష్ బాబు హిందూ సమ్మేళనం మండల అధ్యక్షుడు సెంటెనవ సంటెన్న నాగేష్,గణేష్ మెండే శ్రీధర్,శంకర్ గౌడ్ పృథ్వి పటేల్, మండల బిజెపి నాయకులు మహిళలు పాల్గొన్నారు.



## ప్రాణదానానికి ముందుకు రండి

### టిఎస్‌మయుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను రక్షించవచ్చని టిఎస్‌యూటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్, జ్యోతిరావు పూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతుల సందర్భంగా ఈ నెల 12న కాగజ్ నగర్ పట్టణంలోని ఆదిత్య నర్సింగ్ హోమ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఆమె ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ నిర్భయంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీత మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో ఉండేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతగానో దోహద పడతాయని తెలిపారు. సమాజంలో రక్తదానంపై అవగాహన పెంచుకుని ప్రాణాలను రక్షించడంలో భాగస్వాములు కావాలని కోరారు. 12న ఉదయం 9 గంటల నుండి ప్రారంభమయ్యే ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రావుజీ, రాజకమలాకర్ రెడ్డి, మహిపాల్, ఫణతి మహేష్, ఈర్ల సునీల్ పాల్గొన్నారు.

## బైకుపై నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండలంలోని డోడ్డిగూడ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మహారాష్ట్రలోని పసిగాం గ్రామానికి చెందిన లక్ష్మణ్ తండ్రి (26) అనే యువకుడు ఒక వివాహ శుభకార్యానికి వెళ్తుండగా దొడ్డిగూడ వద్ద అకస్మాత్తుగా ఆవు అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో లక్ష్మణ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో పాటు కుడి చేయి విరిగింది. అతనితో పాటు ప్రయాణిస్తున్న మెంకు అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా ఈఎంటీ సంతోష్, పైలెట్ భీంరావ్ సకాలంలో చేరుకుని బాధితులను వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించారు. రహదారులపై పశువుల సంచారం పెరగడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని నియంత్రించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనలో 108 సిబ్బంది సమయస్ఫూర్తితో స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి చేర్చారు.

## చింతగూడలో ఆధార్ క్యాంపు మరో మూడు రోజులు పొడిగింపు

**ప్రజాపక్షం / జన్నారం :** మండలంలోని చింతగూడ గ్రామంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపును మంచిర్యాల జిల్లా పోస్టల్ అడిషనల్ సూపర్డెంట్ రామారావు సందర్శించారు. శుక్రవారం ఆయన క్యాంపులో జరుగుతున్న నమోదు ప్రక్రియను పరిశీలించి, ప్రజలతో మాట్లాడి వారి అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ గ్రామ ప్రజల నుండి ఆధార్ నమోదుకు మంచి స్పందన లభిస్తోందని, ప్రతిరోజూ అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి సేవలను వినియోగించుకుంటున్నారని తెలిపారు. ప్రజల విజ్ఞప్తి మేరకు చింతగూడలో నిర్వహిస్తున్న ఈ క్యాంపును మరో మూడు రోజుల పాటు పొడిగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి సుతారి వినయ్ కుమార్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## కెరమెరిలో పారిశుద్ధ్య పనులు ప్రారంభం

### సర్పంచ్ పెందోర్ ఆనందరావు

**ప్రజాపక్షం / కెరమెరి :** కెరమెరి గ్రామ పంచాయతీలోని పలు వార్డుల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ పనులను సర్పంచ్ పెందోర్ ఆనందరావు ప్రారంభించారు. చాలా రోజులుగా మురికి కాలువలు మట్టి, చెత్తతో నిండిపోయి నీరు పారేందుకు ఇబ్బందిగా మారడంతో ఈ పూడికతీత పనులు చేపట్టారు. ముఖ్యంగా 7వ వార్డులో జరుగుతున్న పనులను సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ఈ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మురికి నీరు నిల్వ ఉండకుండా కాలువలను శుభ్రం చేస్తున్నామని వివరించారు. గ్రామ పంచాయతీలోని అన్ని వార్డుల్లోనూ ఈ ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉప సర్పంచ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## 430 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం

### డిసిఓ శ్రీనివాస్ రావు



**ప్రజాపక్షం / నందిపేట్ :** నిజామాబాద్ జిల్లాలో అన్ని డివిజన్ పరిధిలో యాసంగి వరి పంట కొనుగోలు కోసం 430 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేస్తామని జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ కేంద్రాల ద్వారా తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని చెప్పారు. శనివారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేస్తామని అన్నారు. పంట బోనస్ గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేవని, రైతులు అనుమానం పడవద్దు, వరి ధాన్యం కాంటా కాగానే బ్యాంకులలో డబ్బు వేస్తాం, ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలని శ్రీనివాస్ రావు అన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నగరంలోని 4,5 డివిజన్ల పరిధిలోని శ్రామికనగర్‌లో ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ నాయకురాలు పశ్య పద్మ మాట్లాడుతూ సీపీఐ ప్రజా ఉద్యమాల్లో భాగంగా ప్రజల వద్దకు నేరుగా వెళ్లి సమస్యలను తెలుసుకోవటంతో పాటు ఉద్యమానికి అయ్యే ఖర్చుల కోసం విరాళాలను సేకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు సహకారమందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, రాజన్న, రాజేశ్వర్, రఘురాం, రంజిత్, సాయిలు, సాయగౌడ పాల్గొన్నారు.

## మోహన్ భాగవత్ కార్యక్రమ ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాపక్షం/బోధన్:** ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పర్యటన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం జిల్లా అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రెంజల్ మండలం కందకుర్తి గ్రామాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించి, జరుగుతున్న ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించారు. భద్రత లాజిస్టిక్స్, విభాగాల మధ్య సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, అన్నీ ఏర్పాట్లు సమయానికి, సమర్థవంతంగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ, రెంజల్ తహసీల్దార్, ఆర్‌అండ్‌బీ డీఈ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ దరఖాస్తుల్లో సవరణకు అవకాశం ఇవ్వాలి



**ప్రజాపక్షం/నిర్మల్ :** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించాలని కొరుతూ టీయూడబ్ల్యూజే(ఐజేయూ)నిర్మల్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కొండూరు రవీందర్,వెంకగారి భూమయ్య బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు వినతిపత్రం సమర్పించారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే సమయంలో జర్నలిస్టులు తమ పేర్లు,ఇతర వివరాలను నమోదు చేయడంలో జర్నలిస్టులు తమ పేర్లు,ఇతర వివరాలను నమోదు చేయడంలో లేదా పత్రాలను అప్‌లోడ్ చేయడంలో కొన్ని చిన్నపాటి పొరపాట్లు దొర్లుతున్నాయని,అయితే ఒకసారి దరఖాస్తును 'సబ్మిట్' చేసిన తర్వాత వాటిని సరిదిద్దుకోవడానికి పోర్టల్‌లో ఎటువంటి ఏడిట్ ఆషన్ లేకపోవడం జర్నలిస్టులకు ఇబ్బందిగా మారిందని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.కేవలం చిన్నపాటి క్లరికల్ తప్పుల వల్ల అర్హులైన జర్నలిస్టుల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉందని,దీనివల్ల వందలాది మంది జర్నలిస్టులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని వారు వివరించారు.ఈ విషయాన్ని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ గారి దృషికి తీసుకెళ్లారు.పోర్టల్‌లో దరఖాస్తులను ఎడిట్ లేదా రివ్యూ చేసుకునే సదుపాయాన్ని కల్పించేలా చర్యలు తసీఉకోవాలని వారు కోరారు.తద్వారా అర్హులైన జర్నలిస్టులందరికీ ఎట్టువంటి ఇబ్బంది లేకుండా అక్రిడిటేషన్ ప్రక్రియ పూర్తవుతుందని విజ్ఞప్తి చేశారు.సోషల్ మీడియా కన్వీనర్ యోగేష్ యూనిట్ సభ్యులు,జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నిరుపేదల పాలిట సంజీవనిగా విస్సా హెల్త్..

### డాక్టర్ నాలం శశికాంత్,డాక్టర్ స్వప్న దంపతుల సేవా ప్రస్థానం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** వైద్య వృత్తిని కేవలం లాభార్జన కోసం కాకుండా,సమాజ సేవకు ఒక సాధనంగా మలుచుకుని వేలాది మంది ప్రాణాలను కాపాడుతున్నారు.విస్సా హెల్త్ అధినేతలు డాక్టర్ నాలం శశికాంత్,డాక్టర్ స్వప్న ఉత్తర తెలంగాణ ప్రాంతంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వారు చేస్తున్న కృషి నేడు అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.ఒకవైపు అత్యున్నత స్థాయి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తూనే,మరోవైపు సమాజానికి తాము ఇవ్వాల్సింది చాలా ఉందనే తపనతో వారు ముందుకు సాగుతున్నారు.సాధారణంగా వైద్య సేవలంటే కేవలం ఆస్పత్రులకే పరిమితమని భావిస్తారు.కానీ.ఈ వైద్య దంపతులు ఆలోచన అందుకు భిన్నం,ప్రయాణ సమయాల్లో మహిళలు తమ పసిబిడ్డలకు పాలు పట్టేందుకు పడే ఇబ్బందులను గమనించి,నిర్మల్ బస్టాండ్‌లో,కదిలి పుణ్యక్షేత్రంలో ప్రత్యేకంగా ''అమ్మ ఒడి'' గదులను ఏర్పాటు చేశారు.ఈ గదులు ఎంతోమంది తల్లులకు ఆత్మగౌరవాన్ని,సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి.అలాగే,కుంటాల మండలంలో అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడేందుకు వారు ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్సు సౌకర్యం ఆ ప్రాంత ప్రజలకు గొప్ప వరంగా మారింది.వైద్యులుగా వారి ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు ఉన్నాయి.పద్మశ్రీ పురస్కార గ్రహీత కనకరాజు కి ఉచితంగా ఆపరేషన్ నిర్వహించి కళాకారుల పట్ల తమకున్న గౌరవాన్ని చాటుకున్నారు.దిమ్మదుర్తికిన చెందిన చిన్నయ్య అనే వ్యక్తికి ప్రమాదంలో కాలు విరిగితే,ఆర్థిక స్తోమత లేని స్థితిలో అతనికి ఉచితంగా శస్త్రచికిత్స చేసి అండగా నిలిచారు.అలాగే వాస్తపూర్ గ్రామానికి చెందిన సుగుణ అనే పేద యువతికి ప్రాణాపాయ స్థితిలటో ఉచిత వైద్యం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.ఇప్పటివరకు 50 కి పైగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి,మారుమూల గ్రామాల్లోని ప్రజలకు సైతం వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు.వైద్య సేవలతో పాటు ఆధ్యాత్మిక చింతనలోనూ విస్సా హెల్త్ ముందంజలో ఉది.బాసర జ్ఞాన సరస్వతి ఆలయానికి ఒక లక్ష రూపాయలు,కడ్తాల్ అయ్యప్ప ఆలయానికి 50 వేలు,అడెల్లి ఆలయ అభివృద్ధికి 50 వేల రూపాయలు విరాళం అందించడమే కాకుండా,గత మూడు సంవత్సరాలుగా నాగోబా ఆలయనికి ,బైంసా పాలజ్ వినాయక ఉత్సవాలకు తమ వంతు సహకారాన్ని నిరంతరం అందిస్తూనే ఉన్నారు.వారి వృత్తి నైపుణ్యానికి ప్రభుత్వ,సామాజిక గుర్తింపులు ఎన్నో లభించాయి.2017లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా డాక్టర్ శశికాంత్ ఉత్తమ వైద్యునిగా పురస్కారం అందుకోగా, పిల్లల వైద్య విభాగంలో డాక్టర్ స్వప్న గారు విశేష సేవలందిస్తూ ఉత్తమ వైద్యురాలిగా పేరు తెచ్చుకున్నారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అత్యధికంగ విజయవంతమైన శస్త్రచికిత్సలు చేసినందుకు గాను 2024లో బెస్ట్ హాస్పిటల్ అవార్డును విస్సా హెల్త్ సొంతం చేసుకుంది.నేడు విస్సా హెల్త్ ఆసుపత్రిలో కిడ్నీ లో రాళ్లు,రోడ్డు ప్రమాదాల్లో జరిగే సంక్లిష్టమైన ఎముకల సర్జరీలు,మెదడు,వెన్నె ముకకు సంబంధించిన నరాల శస్త్రచికిత్సలు,పక్షవాతం వంటి క్లిష్ట పరిస్థితులకు అత్యాధునిక చికిత్స లభిస్తోంది.అంతేకాకుండా,క్యాన్సర్ బాధితులకు,అప్పుడేన పుట్టిన శిశువులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తూ,ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అసలైన అవార్డు అని నమ్మే డాక్టర్ శశికాంత్,డాక్టర్ స్వప్న దంపతుల సేవలు జిల్లా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గవి.

## ప్రారంభం కానీ కేంద్రాలు

### ప్రైవేట్ దళారుల పాలవుతున్న రైతుల కష్టం



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** నియోజకవర్గంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులంతా చేలల్లోనే ఉంటూ రాత్రింబవళ్లు శ్రమించి పంటను కళ్లాలకు చేరుస్తున్నారు. కానీ ఆరుంగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామంటే ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టమైన హామీ రాకపోవటం రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. కొనుగోలు కేంద్రాలు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవటంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తూ రైతులు మోసపోతున్నారు.

### ప్రభుత్వ తీరుపై రైతుల ఆగ్రహం :

సమయానికి కొనుగోలు కేంద్రాలు తెరవని కారణంగా ప్రభుత్వ వైఖరిపై రైతన్నలు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు.అధికారులు ప్రభుత్వం తక్షణమే స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయకపోతే రైతులు దళారుల చేతిలో మరింత నష్టపోయే ప్రమాదముందని రైతు సంఘాలు హెచ్చరిస్తున్నాయి. అన్నదాతల కష్టాన్ని గుర్తించి యుద్ధప్రాపతిపదికన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతుల వాపోతున్నారు.

## మొక్కజొన్న పంటకు నిప్పు పెట్టిన దుండగులు

### మూడు ఎకరాలు దహనం



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా మండలంలోని కుంసర గ్రామంలో దుండగులు రైతు పంటకు నిప్పు పెటిటన ఘటన చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన రైతు లక్ష్మ ణ్ కు చెందిన మూడు ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా అగ్నికి ఆహుతైంది.మధ్యాహ్నం రెండు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పు పెట్టినట్లు స్థానికులు అనుమానిస్తూన్నారు.ఉదయం రైతు పొలానికి వెళ్లి చూడగా పంట పూర్తిగా కాలిపోయిన దృశ్యం కనిపించడంతో ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ,బాధ్యలపై కఠిన చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేస్తున్నారు.నష్టపోయిన రైతుకు ప్రభుత్వం తక్షణమే నష్ట పరిహారం అందించాలని కొరుతున్నారు.

## కిరాయి మూకలతో బిజెపి చేస్తున్న దాడులు సరైనవి కావి : రామకృష్ణ




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కిరాయి మూకలతో కలిసి బీజేపీ చేస్తున్న దాడులు సరైనవి కావని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. బీజేపీ చేస్తున్న అక్రమ వసూళ్లను బయటపెట్టినందుకు కిరాయి మూకలను ఉపయోగించి బహిరంగంగా దాడులకు పాల్పడుతున్నారని ప్రజల ముందుకు నిజాలను తీసుకవస్తే వాటికి సమాధానం చెప్పలేక భయపడి ఇలాంటి దౌర్జన్యాలకు దిగుతున్నారన్నారు. శుక్రవారం రమేష్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి తీవ్ర అవమానం మాత్రమే కాకుండా ప్రజల హక్కులపై నేరుగా దాడి చేయటమని ఇలాంటి దాడులు చూస్తూ ఊరుకోము పని హెచ్చరించారు. రమేష్‌పై దాడి చేయటం ఖచ్చితంగా కుట్రలో భాగమేనన్నారు. ఈ దాడిలో సరైన నిజాలు బయట పెట్టి దోషులను కఠినంగా శిక్షించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. 8వ డివిజన్ బీజేపీ కార్పోరేటర్‌పై రెండు రోజుల క్రితం కేసు నమోదైన విషయం మరుగున పడక ముందే అదే డివిజన్ నుండి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన రమేష్‌పై దాడి జరగడం కక్ష్య సాధింపు చర్యగా కనిపిస్తున్న తరుణంలో ఖచ్చితంగా లోతుగా పరిశీలన చేసి ఇలాంటి తప్పుడు కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. విమర్శలను స్వీకరించి సమాధానం ఇవ్వవల్సింది పోయి దాడులు చేయించటం చాలా బాధాకరమని ఈ విధమైన బెదిరింపులు, దౌర్జన్యాలు ఎంత చేసినా నిజాం దాచలేరని ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారన్నారు. సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారన్నారు. అప్రజాస్వామిక చర్యలను ఖండిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నగరంలోని వినాయక్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిని డాక్టర్ బి.రాజశ్రీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి అందిస్తున్న ఆరోగ్య సేవలను హాజరు రిజిస్ట్రర్‌ను, గర్భిణీ స్త్రీల నమోదును కుక్క కాటు, పాము కాటుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని అన్ని ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రిజిస్ట్రర్‌లను తనిఖీ చేశారు. ప్రజలకు ఏ రకమైన ఇబ్బంది కలకుగండా ఆరోగ్య సేవలందించాలని సిబ్బంది అందరూ సమయపాలన పాటిస్తూ విధులకు హాజరు కావలన్నారు. తనిఖీ సమయంలో ఆస్పత్రి వైద్యాధికారి శ్రీలత, వైద్యసిబ్బంది ఉన్నారు.



# నిజామాబాద్ సెక్యురిటీ కౌన్సిల్ నిజామాబాద్ ప్రీమియర్ లీగ్

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ జిల్లా స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో నిజామాబాద్ సెక్యురిటి కౌన్సిల్ ఆధ్వర్యంలో నిజామాబాద్ ప్రీమియర్ లీగ్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిజామాబాద్ నగరంలో నిర్వహించనున్నామని పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. శుక్రవారం కమిషనరేట్ కమాండ్ కంట్రోల్ నందలి సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ప్రీమియం లీగ్ పోస్టర్లను ఆవిష్కరించారు. క్రీడా పోటీల ద్వారా ముఖ్యంగా యువకులకు, ప్రజలకు సైబర్ సెక్యురిటి, మాదక ద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నిబంధనల పట్ల విస్తృత అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మెగా టోర్నమెంట్ నిర్వహణ కోసం ఎన్ఎస్సి చైర్మన్‌గా సాయి చైతన్య, ఎన్ఎస్సి కన్వీనర్‌గా బస్వారెడ్డి, ఎన్ఎస్సి జనరల్ సెక్రెటరీగా కవితారెడ్డి, ఆర్గనైజింగ్ కమిటి పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కమిటిలో జాయింట్ సెక్రెటరీలుగా కె. శ్రీనివాస్ రెడ్డి (స్పోర్ట్స్), డాక్టర్ కె. శిరీష్ కుమార్ (సైబర్ సెక్యురిటి), సిహెచ్. రజనీకాంత్ (ఫిజికల్ సెక్యురిటి), ట్రెజరర్‌గా కె. సంతోష్ కుమార్ బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. క్రీడా పోటీలలో భాగంగా మొత్తం ఐదు రకాల ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డి పోటీలు నిజామాబాధ్‌లోని జిల్లా క్రీడల ప్రాంగణం, నాగారం మైదానంలో, మూడు విభాగాలలో విజేతలకు మొదటి బహుమతిగా రూ. 20 వేలు, రెండవ బహుమతిగా రూ. 10 వేలు, మూడవ బహుమతిగా రూ. 5 వేలు అందజేయనున్నామన్నారు. కబడ్డి పోటీలు కేవలం పురుషులకు మాత్రమే పరిమితం కగా, యోగా పోటీలు బాల బాలికలకు సుభాష్ నగర్‌లోని కాకతీయ ఒలంపియాడ్ స్కూల్లో నిర్వహించబడతాయి. ఇందులో అండర్ 14, అండర్ 18, 18 ఏళ్లు పైబడిన బాలబాలికలకు మొత్తం ఆరు కేటగిరిలలో 18 బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. యోగా విభాగంలో విజేతలకు మొదటి బహుమతిగా రూ. 3 వేలు, రెండవ బహుమతిగా రూ. 2 వేలు, మూడవ బహుమతిగా రూ. వెయ్యి అందజేయబడుతాయని చెప్పారు. క్రికెట్ పోటీలు కంఠేశ్వర్‌లోని మహిళా డ్రిగీకళాశాల మైదానంలో 12 ఓవర్ల ఫార్మాట్‌లో హార్డ్ టెన్నిస్ బాల్‌తో నిర్వహించబడుతాయన్నారు. క్రికెట్ ఎంట్రీ ఫీజు రూ. 5 వేలు కాగా, కేవలం మొదట నమోదు చేసుకున్న టీములకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుంది. క్రికెట్ విజేతలకు భారీ స్థాయిలో మొదటి బహుమతి రూ. లక్ష, రన్నరప్‌కు రూ. 50 వేల నగదు బహుమతి ప్రకటించారు. క్రికెట్ క్రీడాకారులు సొంతంగా తెలుపు ప్యాంటు, తెలుపు బూట్లు తెచ్చుకోవాలి. నిర్వాహకులు కేవలం టీ షర్టులు మాత్రమే అందిస్తారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ఏప్రిల్ 11 శనివారం నుండి ఏప్రిల్ 17 శుక్రవారం వరకు సాయంత్రం 5 గంటల లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలి. పోటీలకు సంబంధించిన డ్రా ఏప్రిల్ 18 శని




వారం రోజు మధ్యాహ్నం 2 గంటలకు తీయబడును. ఈ టోర్నమెంట్ కేవలం నిజామాబాధ్ జిల్లా వాసులకు మాత్రమే అవకాశం ఉన్నందున, క్రీడాకారులు తప్పని సరిగా తమ వెంట ఆధార్ కార్డు తీసుకురావాలి. యోగా పోటీదారులు వయస్సు దృవీకరణ కోసం స్కూల్ బోనఫైడ్, ఎస్ఎస్సి మెమో సమర్పించాల్సి ఉంటుంది. టోర్నమెంట్ సమన్వయకర్తలుగా జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ బి. పవన్ కుమార్ 9701177144, కబడ్డి కోచ్ ప్రశాంత్ బాధ్యతలు చేపట్టారు. జిల్లాలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పై క్రీడల యొక్క ఇన్‌చార్జి ల పేర్లు వాలీబాల్ బి. మల్లేష్ గౌడ్ 9440711635, బాస్కెట్ బాల్ బి. నరేష్ 9440404424, కబడ్డి ఎం. ప్రశాంత్ 9866770889, యోగా సంగీత 9848420803, గంగాధర్ 8074982200, క్రికెట్ సురేష్ కుమార్ 9849202586, విక్రమ్ 9493309972 లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి బస్వారెడ్డి, ఏసిపి రాజా వెంకట రెడ్డి, సిహెచ్. రజనికాంత్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టంపై తహసీల్దార్‌కు వినతి



**ప్రజాపక్షం/బోధన్:** అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలపై నిజామాబాద్ జిల్లా సాలూర మండలంలోని బిజెపి నాయకులు, రైతులు శుక్రవారం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందచేశారు. గత వారం క్రితం కురిసిన వర్షాలకు సాలూరా మండలంలోని ఆయా గ్రామాల్లో మొక్కజొన్న పంటలు పూర్తిగా నేలమట్టమై రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ విషయంలో రైతులకు ఆదుకోవాలని వారు కోరారు. అదేవిధంగా వెంటనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మందర్న సర్పంచ్ రావుబా గంగాధర్(బిజెపి మండల అధ్యక్షులు) రాజు నరేష్ లక్ష్మణ్ పటేల్, సంజు పటేల్ కాళిదాస్, గంగాధర్, సాయిలు రైతులు పాల్గొన్నారు.

## రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

పర్సన్ ఇన్‌చార్జి రమాదేవి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రల్లోనే రైతులు విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎడపల్లి సోసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి రమాదేవి, తహసీల్దార్ దత్త్రాత్రి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంతో పాటు మంగళ్‌పహాడ్, కుర్నాపల్లి, ఠాణాకలాన్ గ్రామంలో ఎడపల్లి సోసైటీ ఆధ్వర్యంలో, జైతాపూర్ సోసైటీ ఆధ్వర్యంలో జమ్లం, బ్రహ్మణపల్లి, ఏఆర్పీ, పోచారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన ఏ గ్రేడ్ ధాన్యానికి 2389రూపాయాలు, బి గ్రేడ్ ధాన్యానికి 2369 రూపాయాలుగా మద్దతు ధరను నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, అలాగే తేమ శాతాన్ని 17శాతంగా నిర్ణయించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, రైతులు, స్థానిక నాయకులు, సోసైటీ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై పరువునష్టం దావా

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** అసత్యపు ప్రచారం ఆరోపణలు చేస్తున్న వారిపై పరువు నష్టం దావ వేస్తానని, అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు లొంగి నాపై తప్పుడు కేసు నమోదు చేశారని కార్పోరేటర్ మఠం పవన్ ఆరోపించారు. శుక్రవార ంనగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను ప్రజలకు సేవ చేయాలని సంకల్పంతో సేవ చేస్తూ ఎన్నికలలో ప్రజల మద్దతుతో గెలిచానన్నారు. నా గెలుపును ఓర్వలేక కావలని అసత్యపు ఆరోపణలు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ఐదవ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశారన్నారు. నన్ను అవమానించాలనే ఉద్దేశ్యంతో నాపై తప్పుడు కేసు పెట్టించామని పవన్ ఆరోపించారు. ఈ తప్పుడు ఫిర్యాదుకు 5వ ఎస్సై వత్తాసు పలుకుతూ నాకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే కేసు నమోదు చేశారని కార్పోరేటర్ విమర్శించారు. దీనిపై సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఈ అక్రమ కేసు నమోదు వెనుక అధికార పార్టీ నాయకులతో పాటు రియలెస్టేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్, మాజీ కార్పోరేటర్, మరోక వ్యక్తి పాత్ర ఉందన్నారు. రియలెస్టేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గతంలో ఎంతో మందికి ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి లక్షల్లో డబ్బులు వసూలు చేశారని, బాధితులు అతనిపై జిల్లా కలెక్టర్‌కు




ఫిర్యాదు చేశామన్నారు. డివిజన్ పరిధిలో రోడ్డుపై డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు చేపడుతున్న విషయాన్ని కూడా వారి దృష్టికి తీసుకెళ్లానని అందుకే నాపై కుట్ర పన్నుతున్నారన్నారు. తాను డబ్బులు తీసుకున్నట్లు ఆధారాలతో చూపిస్తే దేనికైనా సిద్ధమని ప్రజల పక్షాన ఉండి సేవ చేస్తే తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. డివిజన్ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తయ్యేలా పని చేస్తున్నానని అబద్ధపు మాటలు చెబుతూ నాపై బురద చల్లే ప్రయత్నం మానుకోవాలన్నారు. సాక్ష్యాలుంటే చూపించాలని, లేని పక్షంలో వారిపై కోటి రూపాయల పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

# రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు

జిల్లా కలెక్టర్ హరిత

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** జిల్లాలో రహదారి ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఎస్పీ నీతికాపంత్, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రామాల్లో విద్యుత్ దీపాల ఏర్పాటు, సర్వీసు రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని నేషనల్ హైవే అధికారులకు సూచించారు. రహదారులకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, వేలాడే తీగలను సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రహదారికి ఇరువైపులా ఉన్న స్తంభాలకు రేడియం స్టిక్కర్లు అంటించాలని తెలిపారు. రవాణా శాఖ అధికారులు స్కూల్ బస్సులు, ఇతర వాహనాలను నిరంతరం తనిఖీ చేయాలని పేర్కొన్నారు. రహదారులకు అవసరమైన మరమ్మత్తులు, వంతెనల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. వాహ



నాల వేగ నియంత్రణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై, హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారిపై కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాజస్వ మండలాధికారి లోకేశ్వర్ రావు, డిఆర్డిఓ దత్తారావు, రవాణా శాఖ అధికారి రామచందర్, డిపిఓ భిక్షపతి, విద్యుత్ శాఖ ఎస్ఈ ఉత్తం జాడే, పిఆర్ ఈఈ ధర్మేందర్, విద్యా, వైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** మారుమూల ప్రాంతాలకు సైతం తాగునీటి ఎద్దడి లేకుండా చూడటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ వద్ద ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ బూస్టర్ సిస్టమ్ పనితీరును ఆమె క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఈ బూస్టర్ సిస్టమ్ ద్వారా నీటి సరఫరా జరిగే విధానాన్ని కలెక్టర్‌కు వివరించారు. సాధారణంగా పైప్‌లైన్ చివరన ఉండే ఇళ్లకు నీటి ఒత్తిడి తగ్గి సరఫరా సక్రమంగా అందదని, ఈ ఆన్‌లైన్ బూస్టర్ సిస్టమ్ వల్ల ఆ సమస్య తీరుతుందని అధికారులు తెలిపారు. దీనివల్ల ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు చేరుతుందని వివరించారు. జాన్కంపేట్‌లో ఈ విధానం విజయవంతం కావడంతో, ఇదే తరహా వ్యవస్థను అభంగపట్నం, అబ్బాపూర్, ధర్మారం, ధూపల్లి, వీరన్న గుట్ట గ్రామాల నీటి సమస్యను తీర్చేందుకు, అనంతగిరి, పోచారం గ్రామాల్లో కూడా ఏర్పాటు చేసేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుత వేసవి దృష్ట్యా కూడ ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రతి ఆవాస ప్రాంతానికి నీరు అందుతుందో లేదో తెలుసుకునేందుకు పక్కా పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశాం. నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈలు, రాకేష్, స్వప్న, స్థానిక సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎడపల్లి మండల టిఎంఆర్ఎస్ అధ్యక్షుడిగా ఆకాష్ నియామకం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** తెలంగాణ మాదిగల హకుల పోరాట సమితి (టిమ్మార్పీఎస్) ఎడపల్లి మండల నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం మండల కేంద్రంలో జరిగింది. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడిగా కర్రోల్ల ఆకాష్ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి టిఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లని శివ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ ఆదేశాల మేరకు గ్రామీణ స్థాయిలో సంఘాన్ని బలపేతం చేసే లక్ష్యంతో ఈ నూతన కమిటీని ప్రకటించినట్లు వారు తెలిపారు.